క్లుప్తంగా

నేడు జూలపల్లికి సాక్షిరూపానందస్వామి రాక

జూలపల్లి: మండల కేంద్రంలోని శ్రీరాజరాజేశ్వస్వామి ఆలయానికి హైదరాబాద్ చిన్మయ మిషన్ శ్రీసాక్షిరూపానందస్వామి సోమవారం వస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యుడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పాటకుల అనిల్ తెలిపారు.

నృసింహ జయంతి

ఎలిగేడు: ముప్పిరితోటలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో తిరుక్కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం నృసింహ జయంతిని వైభవంగా నిర్వహించారు. రామిడి వెంకటరామిరెడ్డి. శ్రీనివాసరెడ్డి, కొండల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో సత్తా చాటాలి

సుల్తానాబాద్: క్రీడాకారులు శిక్షణ పొంది క్రీడల్లో సత్తా చాటాలని వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ముస్త్యాల రవీందర్ అన్నారు. ఆదివారం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో వేసవి వాలీబాల్ క్రీడా శిక్షణ శిబిరానికి సుల్తానాబాద్ సింగిల్‌విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్ సమకూర్చిన వాలీబాల్‌ను అందజేసి మాట్లాడారు.

వీర జవాన్‌కు నివాళి



ధూళికట్టలో నివాళి అర్పిస్తున్న గ్రామస్తులు

ఎలిగేడు: ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాకిస్తాన్ జరిపిన దాడుల్లో దేశ రక్షణకు అమరుడైన ఎం.మురళీనాయక్‌కు ఆదివారం రాత్రి ధూళికట్టలో అంబేడ్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. మాజీ సర్పంచ్ బాలుసాని పరశురాములుగౌడ్, మాజీ వార్డు సభ్యుడు అట్టెపల్లి కనకయ్య, భూసారపు రమేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ మణికేశ్వర్‌రెడ్డి

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ చైతన్యపురికాలనీలో బిటుసి ఫౌండేషన్, సిగ్మా హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. కాలనీలోని ప్రజలకు డాక్టర్ మణికేశ్వర్‌రెడ్డి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. బిటుసి ఫౌండేషన్ అధ్యక్షుడు ప్రభాకర్, సిగ్మా హాస్పిటల్ వైద్యులు, బూర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

కాల్వశ్రీరాంపూర్: ఇదులాపూర్ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాలు.. జమ్మికుంట నుంచి గోదావరిఖని వెళ్తున్న కారు ఇదులాపూర్ శివారులో బైక్‌పై వెళ్తున్న జాఫర్‌ఖాన్ గ్రామానికి చెందిన చొప్పరి సదానందంను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సదానందంకు తీవ్ర గాయాలు కాగా.. ఆటోలో పెద్దపల్లి ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని ఎస్సై వెంకటేశ్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పెద్దపల్లిరూరల్: గుర్రాంపల్లికి చెందిన వ్యవసాయ కూలీ అటుకుల రవీందర్‌రెడ్డి(40) చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై లక్ష్మణ్‌రావు తెలిపిన వివరాలు.. వ్యవసాయ కూలీగా పనిచేస్తూ జీవించే రవీందర్‌రెడ్డి కూతురు పెళ్లికి చేసిన అప్పుతీర్చలేక ఇబ్బందులు పడుతున్నాడు. మానసికవేదనకు గురై శుక్రవారం పురుగుల మందు తాగాడు. కుటుంబీకులు పెద్దపల్లిలో ప్రాథమిక వైద్యం చేయించి మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తరలించగా, చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఉత్సాహంగా వేసవి శిబిరాలకు..

- పలు క్రీడల్లో సాధన చేస్తున్న చిన్నారులు



సుల్తానాబాద్‌లో సాధన చేస్తున్న చిన్నారులు

సుల్తానాబాద్: రాష్ట్ర ప్రభుత్వం వేసవి కాలంలో విద్యార్థులకు క్రీడలపై శ్రద్ధతోపాటు మెలకువలు నేర్చుకోవడానికి అవకాశాన్ని కల్పించింది. జిల్లా వ్యాప్తంగా బాలబాలికలకు క్రీడా శిబిరాల్లో ప్రత్యేకత, నైపుణ్యం, మెలకువలు, ఆటల్లో రాణించేలా విద్యార్థులకు తర్ఫీదునిస్తున్నారు. నెల రోజులు సెలవు దినాల్లో వాలీబాల్, కబడ్డీ, ఖోఖోతోపాటు పలు క్రీడలపై పెద్దపల్లి, సుల్తానాబాద్, జూలపల్లి, రామగిరి, కాల్వశ్రీరాంపూర్, పలు ప్రాంతాల్లో క్రీడా శిబిరాలను నిర్వహిస్తున్నారు. విద్యాభ్యాసం కొనసాగిస్తూనే ఆటల్లో మెలకువలతో ముందుకెళ్తున్నారు. మే ఒకటి నుంచి జూన్ 6 వరకు శిక్షణ ఇవ్వాలని రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ(సాట్స్), జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల క్రీడలను ప్రారంభించనున్నారు. అర్బన్ ప్రాంతాల్లో 5, గ్రామీణ ప్రాంతాల్లో 10 జిల్లావ్యాప్తంగా క్రీడా శిబిరాలు ఏర్పాటు చేశారు. ఇప్పటికే దరఖాస్తులను ఆహ్వానించడంతో ఆసక్తి ఉన్న సీనియర్ క్రీడాకారులు వ్యాయామ ఉపాధ్యాయుడికి దరఖాస్తు చేసుకోగా.. వారికి శిక్షణ ఇచ్చి బాధ్యతలు అప్పగించారు. గౌరవ వేతనం రూ.5వేలు ఇవ్వనున్నారు. ఉదయం, సాయంత్రం విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నారు. క్రీడాకారులకు అవసరమయ్యే మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూస్తామని డీవైఎస్‌వో సురేశ్ తెలిపారు.

మెలకువలు నేర్పుతున్న



మైదానంలో ఆటలు ఎలా ఆడాలి.. ఎదుటివారి ఎత్తులను ఎలా ఎదుర్కొని విజయం సాధించాలో మెలకువలు చెబుతున్న. అప్పటికప్పుడే ఎదుటివారి ఎత్తుగడలను చిత్తు చేస్తూ ముందుకెళ్తే విజయం సొంతమవుతుంది.

– గెల్లు మధుకర్‌యాదవ్, ఖోఖో వేసవి శిబిరాల కోచ్, సుల్తానాబాద్

రెండేళ్ల నుంచి శిక్షణ



వేసవి కాలంలో శిక్షణ వినియోగించుకుంటున్న. రెండేళ్ల క్రితం నుంచి శిక్షణ తీసుకోవడంతోపాటు రాష్ట్రస్థాయి ఆటల్లో పాల్గొన్న. రాష్ట్రస్థాయి సీఎం కప్‌లో పాల్గొన్న. జాతీయస్థాయిలో ఆడడమే లక్ష్యం.

– మనోజ్‌కుమార్, ప్రభుత్వ పాఠశాల విద్యార్థి

రాణించడమే లక్ష్యం



క్రీడా శిబిరాల్లో పాల్గొంటున్న. రాణించడమే లక్ష్యంగా శిక్షణ తీసుకుంటున్న. పీఈటీ ప్రోత్సాహంతోపాటు తల్లిదండ్రులు సైతం శ్రద్ధ తీసుకోవడంతో ముందుకెళ్తున్న. అన్ని ఆటలపై పట్టు సాధించేలా కృషి చేస్తున్న.

– అజయ్, ప్రభుత్వ పాఠశాల విద్యార్థి, సుల్తానాబాద్

జాతీయస్థాయిలో రాణిస్తా



జాతీయస్థాయిలో రాణించడమే లక్ష్యంగా శిక్షణ తీసుకుంటున్న. ఖోఖో జాతీయస్థాయి ఆటలో రాణించలేకపోయా. భవిష్యత్తులో రాణించి కెప్టెన్‌గా అవ్వడమే లక్ష్యంగా ముందుకెళ్తున్న.

– వైష్ణవి, ఖోఖో, ప్రభుత్వ జూనియర్ కళాశాల, సుల్తానాబాద్



డీవైసీఎంవోను సన్మానిస్తున్న హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్



జ్యోతినగర్: చీరలు అందిస్తున్న సభ్యులు

ఘనంగా మాతృ దినోత్సవం

గోదావరిఖని: సింగరేణి ఏరియా ఆసుపత్రిలో మాతృ దినోత్సవం నిర్వహించారు. ఆసుపత్రి డీవైసీఎంవో డాక్టర్ అంబికను హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిప్ప లలిత ఆదివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సింగరేణి సీఎంవో డాక్టర్ కిరణ్‌రాజ్‌కుమార్, డాక్టర్ శ్రీలత, వైద్య సిబ్బంది, స్టాఫ్ నర్సులు, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

జ్యోతినగర్: ప్రేమ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దాతలు లాహోటి విమల్‌కుమార్, కోదాటి శ్రీనివాస్, కుమార్–పావని, కిషోర్ సౌజన్యంతో ఇందిరమ్మకాలనీలోని ట్రస్టులో ఘనంగా నిర్వహించారు.



మహిళలను సన్మానిస్తున్న నాయికులు

పహల్గాంలో జరిగిన విషాద సంఘటనలను గుర్తుచేసుకొని యుద్ధంలో వీర మరణం పొందిన జవాన్లకు మౌనం పాటించారు. కొవ్వొత్తులు వెలిగించి నివాళి అర్పించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం సెంట్రల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వడ్డేపల్లి శంకర్ మాట్లాడారు. మాతృమూర్తులకు చీరలు పంపిణీ చేశారు.

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ చైతన్యపురికాలనీలో రామగుండం శాసన సభ్యుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ఆదేశాలతో ఆదివారం మదర్స్ డే సందర్భంగా మహిళలకు శాలువాలతో ఘనంగా సన్మానం చేశారు. కార్పొరేషన్ అధ్యక్షుడు బొంతల రాజేశ్, 14వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు బూర్ల శ్రీనివాస్, ముస్తఫా, గట్ల రమేశ్, సాయితేజ, కన్నూరి తిరుపతి, అంతడుపుల రవి, బిటుసి ఫౌండేషన్ అధ్యక్షుడు ప్రభాకర్ పాల్గొన్నారు.



కుమ్మరికుంట దారిలో 'కోనోకార్పస్'

జూలపల్లి: కోనోకార్పస్ చెట్లతో చర్మ, శ్వాస సంబంధ వ్యాధులు వస్తాయన్న వదంతులు వ్యాపించడంతో గ్రామాల్లో ఈజీఎస్ నిధులతో పంచాయతీలు పెట్టిన కోనోకార్పస్ చెట్లను తొలగించారు. మండల కేంద్రం నుంచి బాలరాజుపల్లె, కుమ్మరికుంట గ్రామాల మధ్య కోనోకార్పస్ చెట్లు ఏపుగా పెరిగి ఎండలకు చల్లని నీడనిస్తున్నాయి. చర్మ, శ్వాసకోస వ్యాధులు వస్తాయో లేదో నిర్ధారణ చేసి తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ట్రాక్టర్ డ్రైవర్లకు పెరిగిన వేతనాలు



మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రతినిధులు

జ్యోతినగర్: ఎన్టీపీసీ జ్యోతినగర్ ప్రాంతంలో ట్రాక్టర్లపై పని చేసే డ్రైవర్లకు వేతనాలు పెరిగాయని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఇ.నరేశ్, ఉపాధ్యక్షుడు చిలుక శంకర్ అన్నారు. ఎన్టీపీసీ ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జ్యోతినగర్ ప్రాంతంలో 25 ఏళ్లుగా ట్రాక్టర్లపై డ్రైవర్లుగా పని చేస్తున్నారని, వీరికి ప్రతీ రెండేళ్లకోసారి పెరుగుతున్న ధరలకనుగుణంగా వేతన సవరణ ఒప్పందం జరుగుతుందన్నారు. ప్రతీ డ్రైవర్‌కు నెలకు వేతనం రూ.17,100, సంవత్సరానికి రెండు జతల యూనిఫామ్స్, ఒక జత షూ, ఒక హెల్మెట్, ఒక టవల్, నెలకు 4 సంతూర్ సబ్బులు, 4 బట్టల సబ్బులు, ఒక టవల్, ఏడాదికి ఒక నెల వేతనం కింద బోనస్ చెల్లింపు, 18 లీవులు, ఏడాది పండుగ సెలవులు పది రోజులివ్వాలని నిర్ణయించారని అన్నారు. బి.కొమురయ్య, ఎడ్ల రవికుమార్, మురళి, తిరుపతి, శ్రీనివాస్, స్వామి, సురేశ్, రమేశ్ తదితరులున్నారు.

వన్ నేషన్.. వన్ ఎలక్షన్‌పై అవగాహన



మాట్లాడుతున్న సోమారపు లావణ్య

జ్యోతినగర్: వన్ నేషన్.. వన్ ఎలక్షన్‌తో దేశ ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని, ప్రభుత్వాలకు రూ.కోట్ల వ్యయం తగ్గుతుందని, అమూల్య సమయం మిగులుతుందని భారతీయ జనతా పార్టీ జిల్లా ఇన్‌చార్జి సోమారపు లావణ్య అన్నారు. ఎన్టీపీసీ కృష్ణానగర్‌లోని పార్టీ నాయకుడు బుర్ర నరేశ్‌గౌడ్ నివాసంలో ఆదివారం ఏర్పాటు చేసిన సదస్సుకు హాజరై మాట్లాడారు. బీజేపీ నాయకులు సప్ప నాగరాజు, పొన్నం ప్రశాంత్, గోపాల్, బాగాల స్వామి, చెలకాని శ్రీనివాస్, లగిశెట్టి రవి, గూడెపు రాజయ్య, బుర్ర లత, మౌనిక, జ్యోతిదేవి, జయశ్రీ తదితరులున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఓదెల: పొత్కపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని గుంపుల మానేరు నుంచి అక్రమంగా ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తుండగా ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై దికొండ రమేశ్ పేర్కొన్నారు.

వృథాగా నీటి ట్యాంక్



సుల్తానాబాద్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్మించిన నీటి ట్యాంక్ ఉపయోగంలోకి తీసుకురావాలని పట్టణ ప్రజలు అధికారులను కోరుతున్నారు. మిషన్ భగీరథ నిధులతో నిర్మాణం పూర్తి చేశారు. పైపులైన్ ట్యాంక్ వరకు వేసినా కనెక్షన్ ఇవ్వకపోవడంతో ట్యాంక్ పైకి నీరు పోవడం లేదని, అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని నీళ్లు వెళ్లేలా చేసి సరఫరా చేయాలని వేడుకుంటున్నారు.

చెట్టంతా పుష్పాలే..



సుల్తానాబాద్: రాజీవ్ రహదారి పక్కన పలు ప్రాంతాల్లో మందారం పువ్వుల్లా చెట్లకు పూలు పూయగా.. రహదారి వెంట వెళ్లే ప్రయాణికులు వాటిని చూస్తూ ఆనందిస్తున్నారు. పూసాల రహదారి వెంట చెట్లు పూలతో కళకళలాడుతున్నాయి.



రామగుండం: గత ప్రభుత్వ హయాంలో యుద్ధ ప్రాతిపదికన నిర్మించిన రైతు భవన్ నిర్మాణంలో నాణ్యత లోపించడంతో మూడేళ్లకే శిథిలావస్థకు చేరుకుంది. అంతర్గాం మండల కేంద్రంలోని రైతు భవన్ వద్ద ఫ్లోరింగ్ టైల్స్ పూర్తిగా పగిలి లేస్తున్నాయి. ప్రభుత్వ నిర్మాణాలపై అధికారుల పర్యవేక్షణ లోపించడంతోనే ఇలాంటి నాసిరకమైన నిర్మాణాలు చోటుచేసుకుంటాయని మండల ప్రజలు పేర్కొంటున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

సింగరేణి వార్తలు

హామీల అమలుకు పోరాటం



మాట్లాడుతున్న తిరుపతి

గోదావరిఖని: సింగరేణి కార్మికులకిచ్చిన హామీల అమలుకు ఐఎన్‌టీయూసీ పోరాటం చేస్తుందని కేంద్ర కార్యదర్శి గడ్డం తిరుపతియాదవ్ అన్నారు. ఆదివారం ఓసీపీ–1 సైటాఫీస్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఈనెల 7, 8, 9ల్లో జరిగిన యూనియన్ కోర్ కమిటీ సమావేశంలో సింగరేణిలోని పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం తీర్మానం చేసినట్లు వివరించారు. ఇన్‌కంటాక్స్ రద్దు, పెండింగ్‌లో ఉన్న విజిలెన్స్ కేసులను వన్‌టైం సెటిల్‌మెంట్ కింద క్లియర్ చేయాలని, సింగరేణి వ్యాప్తంగా 11 ఏరియాల్లోని కార్మికులకు సొంతింటి కల అమలు చేయాలని ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నామన్నారు. ఈనెల 20న జరిగే సమ్మెకు కార్మికులు సిద్ధంగా ఉండాలని కోరారు. నాయకులు గునిగంటి వెంకటస్వామి, నాయకులు ఆరీఫ్, మదార్, రాజన్న, శంకర్, సంజీవ్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్‌గా దాస్



గోదావరిఖని: ఐఎన్‌టీయూసీ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్‌గా వడ్డేపల్లి దాస్‌ను ఆదివారం నియమించారు. ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ నియామక పత్రం అందజేశారు. దాస్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ పదవిని అప్పగించిన ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి, జనక్‌ప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

కార్మిక హక్కులు కాలరాయొద్దు



బుక్‌లెట్ ఆవిష్కరిస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాసేందుకు కుట్రలు పన్నుతోందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు అన్నారు. పెద్దపల్లిలోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం సమ్మె ప్రాధాన్యం తెలిపే బుక్‌లెట్ ఆవిష్కరించారు. ఈనెల 20న తలపెట్టిన సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలన్నారు. నాయకులు నరేశ్, ముస్తఫా, రాజు, సంపత్, శ్రావణ్ తదితరులున్నారు.

ఇళ్ల చుట్టూ ప్లాస్టిక్ కవర్లు



ధర్మారం: ఎంపీడీవో కార్యాలయం రోడ్డుకు ఇళ్ల సమీపంలోనే ప్లాస్టిక్ కవర్లు, చెత్త పడి ఉన్నా సంబంధిత గ్రామ పంచాయతీ సిబ్బంది పట్టించుకోవడం లేదు. దాదాపు అర కిలోమీటర్ దూరం నుంచి వస్తున్న డ్రైనేజీలో కొట్టుకొస్తున్న ప్లాస్టిక్ కవర్లు ఈ ప్రాంతంలో ఉండిపోతున్నాయి. ప్రతిరోజు మండలస్థాయి అధికారులు, పంచాయతీ సిబ్బంది చూస్తున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.



పూర్వ విద్యార్థుల సమ్మేళనం

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల 1983–84 విద్యార్థులు ఆదివారం నర్సయ్యపల్లిలోని విజయ గార్డెన్‌లో కలుసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులైన సాంబయ్య, రాంచంద్రారెడ్డి, రఘు, వెంకటేశ్వర్లును సన్మానించారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకొని ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు.